ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

వెల్దుర్తి, డిసెంబర్ 20: పొలంలో కేజ్‌వీల్‌తో దున్నుతుండగా ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అరెగూడెం గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మెరుగు ప్రభాకర్ అదే గ్రామానికి చెందిన కుక్కల శంకర్ ట్రాక్టర్‌తో వారి పొలాన్ని కేజ్‌వీల్‌తో దున్నుతున్నాడు. ట్రాక్టర్‌పై నుంచి పడి వెనుక భాగంలో ఉన్న గొర్రు ప్రభాకర్‌కు తగలడంతో తీవ్ర గాయాలపాలై మృతిచెందాడు. ప్రభాకర్‌కు భార్య యశోద, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

కేసీఆర్ కాలనీలో విద్యుదాఘాతం

కేసీఆర్ కాలనీలో చెలరేగుతున్న మంటలు

రామాయంపేట, డిసెంబర్ 20: పట్టణంలోని కేసీఆర్ కాలనీలో గురువారం రాత్రి విద్యుత్‌ఘాతంతో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. కేసీఆర్ కాలనీలోని 12వ బ్లాక్‌లో రాత్రి 11గంటలకు విద్యుత్ కేబుల్‌లో మంటలు చెలరేగాయి. దీంతో కాలనీవాసులు ఆందోళనలకు గురయ్యారు. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది కాలనీకి చేరుకుని మంటలు అదుపు చేశారు.

వ్యక్తి అదృశ్యం

విక్రం (ఫైల్)

శివ్వంపేట, డిసెంబర్ 20: వ్యక్తి అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సికిందాపూర్‌లో జరిగింది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సికిందాపూర్ పంచాయతీ పిట్టలవాడకు చెందిన సునీత తన భర్త విక్రం(30), పిల్లలతో కలసి గురువారం రాత్రి రోజులాగే ఇంట్లో నిద్రించారు. శుక్రవారం ఉదయం సునీత లేచేవరకు తన భర్త విక్రం కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. గోమారం శివారులోని చెరువు చుట్టుపక్కల వెతుకుతుండగా చెప్పులు, బట్టలు, ఫోన్ కనిపించాయి. విక్రం ఆచూకీ లేపోవడంతో పోలీసులకు పిట్టల సునీత ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు.

మతిస్థిమితం లేని బాలుడు మృతి

రేగోడు, డిసెంబర్ 20: మతిస్థిమితం లేని బాలుడు ఆటోలో నుంచి దూకి మృతి చెందినట్లు ఎస్సై పోచయ్య శుక్రవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్వాల్‌పల్లి తండాకు చెందిన శ్రీను నాయక్ కుమారుడు శ్రీకాంత్ (12)గా గుర్తించారు. బాలుడికి మతిస్థిమితం లేక ఈ నెల 19న మధ్యాహ్నం తండా నుంచి కొత్వాల్‌పల్లికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో అదే రోజు సాయంత్రం తండాకు వెళ్తుండగా ఆటోలో నుంచి దూకాడు. దీంతో తలకు బలమైన గాయమైంది. జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి శ్రీనునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పక్కాగా చేయాలి

హెలిప్యాడ్ లాండింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట, డిసెంబర్ 20: ముఖ్యమంత్రి పర్యటనకు పక్కా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లను చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. ఈ నెల 25న సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ జిల్లా పర్యటన, మెదక్‌చర్చి, ఏడుపాయల వనదుర్గామాత దర్శనానికి రానున్న సందర్భంగా శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి ఏడుపాయల, పోతంశెట్టిపల్లి రెండో బ్రిడ్జి వద్ద హెలిప్యాడ్ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25న సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా ఏడుపాయలకు హెలిప్యాడ్‌లో రానున్న తరుణంలో హెలిప్యాడ్ లాండింగ్ స్థలం, ఆలయ ప్రాంగణం, పరిసరాలను పరిశీలించామన్నారు. సంబంధిత అధికారులకు ఏర్పాట్లపై తగు సూచనలు చేశారు. వివిధ శాఖల అధికారు సమన్వయంతో పనులు చేపట్టి త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సతీశ్, ఆలయ అర్చకులు శంకర్‌శర్మ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పెళ్లికి హాజరైన ప్రముఖులు

పాపన్నపేట, డిసెంబర్ 20: పాపన్నపేటలోని ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన వివాహ వేడుకకు ప్రముఖులు హాజరయ్యారు. పాపన్నపేటకు చెందిన నీతాలాక్షప్ప చెల్లి పెళ్లి వేడుకలకు బీఆర్ఎస్ నాయకుడు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, నియోజక ఇన్‌చార్జ్ కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కుమ్మరి జగన్, మాజీ జడ్పీటీసీ లింగన్న గారి మల్లప్ప, ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, గోవింద్ నాయక్, రమేశ్, మాడ్యం బాలకృష్ణ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
FOR SALE
★Prime properties for sale at Siddipet Please contact : 9299008929, 6304851467, 8185855813
NT-99351
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అబద్ధపు హామీలతో మోసం చేసిన కాంగ్రెస్

నర్సాపూర్: పోలీసుల అదుపులో ఆటో డ్రైవర్లు

చిలిపిచెడ్: ఆటో డ్రైవర్ల ముందస్తు అరెస్టు

నిజాంపేటలో ముందస్తు అరెస్టైన ఆటో డ్రైవర్లు

- కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి
- రూ.12వేల జీవనభృతి చెల్లించాలి
- ముందస్తు అరెస్ట్‌లు మంచి పద్ధతి కాదు
- జిల్లా ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు

నర్సాపూర్, డిసెంబర్ 20: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆటో డ్రైవర్లు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వడంతో నర్సాపూర్ మండలానికి చెందిన ఆటో డ్రైవర్లను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో తమకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. రూ.12 వేల జీవన భృతిని చెల్లించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రామాయంపేటలో..

రామాయంపేట, డిసెంబర్ 20: సమస్యలు పరిష్కరించకుండా పోలీసులు అరెస్టు చేయడం పద్ధతి కాదని ఆటో డ్రైవర్లు పేర్కొన్నారు. హైదరాబాద్ వెళ్తున్న ఆటో డ్రైవర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

నిజాంపేటలో..

నిజాంపేట, డిసెంబర్ 20: తమ సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన మండల ఆటో డ్రైవర్లను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో జాల పోచయ్య, అబ్దుల్‌పాషా, మల్లేశం, షాదుల్లా, సాయికుమార్, ఉదయ్‌కుమార్ ఉన్నారు.

చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, డిసెంబర్ 20: మండలంలోని ఆటో డ్రైవర్లు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడికి తరలుతున్న సమయంలో ముందస్తుగా వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి, డిసెంబర్ 20: ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వం మాట మార్చి మోసం చేసిందని ఆటో డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ తలపెట్టిన ఆటోడ్రైవర్లు చలోఅసెంబ్లీకి తరలివెళ్లకుండా ఆటోడ్రైవర్లను పోలీసులు ముందస్తు అరె స్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో మం డల అధ్యక్షుడు వీరాగౌడ్, ఉపాధ్యక్షుడు నరేందర్‌గౌడ్, గంగులు, శ్రీను, నర్సింలు, మహేశ్, స్వామి, భాషాగౌడ్ ఉన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట, డిసెంబర్ 20: సమస్యల పరిష్కారానికి ఆటో డ్రైవర్లు తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడిని కట్టడి చేయడానికి శివ్వంపేటలో ఆటో డ్రైవర్లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో డ్రైవర్లు ఎండీ చాంద్, మహేశ్, లింగరాజు, ఇబ్రహీం, ప్రశాంత్, మల్లేశ్, నిఖిల్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం, డిసెంబర్ 20: తమ డిమాండ్ల సాధన కోసం అసెంబ్లీ ముట్టడికి బయలు దేరిన ఆటో డ్రైవర్లను అల్లాదుర్గం పోలీసులు ముందుస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, డిసెంబర్ 20: చలో అసెంబ్లీ కార్యక్రమం ఉన్నందున ఆటో డ్రైవర్లను చిన్నశంకరంపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అసెంబ్లీకి వెళ్లకుండా చిన్నశంకరంపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

శివ్వంపేట పోలీసుల అదుపులో ఆటోడ్రైవర్లు

వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్లు

చిన్నశంకరంపేట పోలీసుల అదుపులో ఆటో డ్రైవర్లు

దివ్యాంగులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్

దివ్యాంగుల శిబిరంలో కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): దివ్యాంగులు అవకాశాలు అందిపుచ్చుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శుక్రవారం జిల్లా దవాఖానలో నిర్వహించిన ప్రత్యేక దివ్యాంగ వైద్య శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. దివ్యాంగులకు ఎలాంటి అనారోగ్య సమస్యలైనా పరిష్కరించాలని, అన్ని రకాల ఉచిత వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా దవాఖానలో దివ్యాంగులకు సరైన వైద్యం అందుబాటులో లేని యెడల చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు పంపిస్తామన్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా రెండో మంగళవారం ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, జిల్లా దవాఖాన సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి 58 మంది ఎంపిక

జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారి నాగరాజు

మెదక్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో 58 మంది బాల బాలికలు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజు తెలిపారు. శుక్రవారం బాలురు, బాలికల విభాగంలో మెదక్ అవుట్ డోర్ స్టేడియంలో చెస్ పోటీలు, పీఎన్ఆర్ ఇండోర్ స్టేడియంలో యోగా పోటీలు నిర్వహించారు. వెస్లీ ఉన్నత పాఠశాల మెదక్ క్రీడా మైదానంలో హ్యాండ్‌బాల్, జడ్పీహెచ్ఎస్ నర్సాపూర్‌లో కిక్ బాక్సింగ్ నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులను అభినందించి, బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ చెస్‌లో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలు, యోగాలో 18 మంది బాలురు, 18మంది బాలికలు, కిక్ బాక్సింగ్‌లో 9 మంది బాలురు, 9 మంది బాలికలు మొత్తం 58 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 27వ తేదీ నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. హ్యాండ్ బాల్ క్రీడలో 12 మంది బాలురు, 12 మంది బాలికలు ఎంపికయ్యారన్నారు. వీరు ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగే ఎంపికల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కరణం గణేశ్ రవికుమార్, జాతీయ రెఫరీ సత్యనారాయణ, పీడీలు శ్యామయ్య, దేవేందర్ రెడ్డి, రాజేందర్, మహిపాల్, శ్రీనివాసరావు, దాసరి మధు, వ్యాయామ టీచర్లు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, డిసెంబర్ 20: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా లో తమ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలను పోలీస్ అధికారులు సందర్శించి, ట్రబుల్ మాంగర్స్, తరచూ తగాదాలు, నేరాలకు పాల్పడేవారిపై నిఘా ఉంచాలన్నారు. గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా చేయాలని, ఏఏ అంశాలు క్రోడీకరించాలి, తదితర అంశాల గురించి వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పనిచేసి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. లాంగ్ పెండింగ్ కేసులు, గుర్తు తెలియయని మృతదేహాల కేసులను త్వరగా ఛేదించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి

మెదక్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెదక్ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మెకు శుక్రవారం పీఆర్టీయూ మద్దతు తెలిపింది. 11 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె చేస్తున్న శిబిరంలో పీఆర్‌టీయూ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి సంఘీభావం ప్రకటించారు. సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయించే బాధ్యత పీఆర్టీయూ తీసుకుంటుందని హామీ ఇచ్చారు. అంతవరకు మినిమం టైమ్ స్కేల్ ఇప్పిస్తామని తెలిపారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల కోర్కెలు న్యాయమైనవని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేజీబీవీలో పనిచేస్తున్న ఉపాధ్యాయినులు నైట్ డ్యూటీలు, పని ఒత్తిడి, తక్కువ వేతనంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమ్మెలో జిల్లా అధ్యక్ష, ప్రధాన, కార్యదర్శులు సుంకరి కృష్ణ, సామ్య నాయక్, గౌరవ అధ్యక్షుడు దుర్గయ్య, సబ్బని శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి, ఎల్.మల్లారెడ్డి, శిరిగే చంద్రశేఖర్, ఆశయ్య, సుభాష్‌రెడ్డి, లింగం, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలి

రామాయంపేట: అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న యూత్ సభ్యులు

రామాయంపేట, డిసెంబర్ 20: బీజేపీ నాయకులు అంబేద్కర్‌ను విమర్శించడం సరికాదని అంబేద్కర్ యూత్ సభ్యులు పేర్కొన్నారు.శుక్రవారం పట్టణంలోని మెదక్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. రాజ్యాంగం రాసిన అంబేద్కర్‌ను విమర్శించడం బీజేపీ నాయకులు మానుకోవాలన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, డిసెంబర్ 20: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా దళితలకు క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని చిట్కుల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి సంగారెడ్డి-మెదక్ రోడ్డుపై అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి, డిసెంబర్ 20. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వాఖ్యలను నిరసిస్తూ మాసాయిపేటలో దళిత సంఘాల నాయకులు దిష్టిబొమ్మను దహనం చేశారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, డిసెంబర్ 20: అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నర్సాపూర్‌లో దళిత సంఘం ఆధ్వర్యంలో అమిత్ షా ఫ్లెక్సీని దహనం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, డిసెంబర్ 20: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రిని వెంటనే క్షమాపణ చెప్పాలని అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు బండెళ్ల సాయిలు, ముత్తిగళ్ల రామచంద్రం డిమాండ్ చేశారు. అగ్రహారంలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

నర్సాపూర్‌లో అమిత్ షా ఫ్లెక్సీని దహనం చేస్తున్న దళిత సంఘ నాయకులు

కేటీఆర్‌పై ప్రభుత్వ కుట్ర తగదు

బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు కర్రె రమేశ్

కర్రె రమేశ్

రాయమాయంపేట, డిసెంబర్ 20: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టడం సరికాదని, ప్రభుత్వం వెంటనే కొట్టివేయాలని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు కర్రె రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం రామాయంపేటలో విలేకరులతో మాట్లాడారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్‌లో అవకతవకలు జరిగాయంటూ రేవంత్‌రెడ్డి కుట్రపూరితంగా కేసులు బనాయించడం పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ సర్కార్ కావాలనే కేటీఆర్‌పై రాజకీయ కక్షతో కేసులు పెడుతున్నదన్నారు.

జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు

నర్సాపూర్ కిక్ బాక్సింగ్‌లో పాల్గొన్న క్రీడాకారులు

నర్సాపూర్, డిసెంబర్ 20: నర్సాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్ (బాలుర)లో జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్, ఉషూ క్రీడలను శుక్రవారం నిర్వహించారు. జిల్లాలోని 21 మండలాల నుంచి 100 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కిక్ బాక్సింగ్ నుంచి రాష్ట్ర స్థాయికి 18 మంది ఎంపికయ్యారు. ఉషూ క్రీడల్లో సబ్ జూనియర్ విభాగంలో 6 మంది, 12 మంది, విద్యార్థులు విజయం సాధించారు జూనియర్ విభాగంలో 11 మంది విజయం సాధించి రాష్ట్ర క్రీడలకు ఎంపికయ్యారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రాణించిన క్రీడాకారులకు బంగారు, వెండి పతకాలు అందించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో నాగరాజు, పీడీలు ఆంజనేయులు, శ్రీకాంత్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

మెదక్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): మైనార్టీ మహిళలకు ఈ నెల 21 నుంచి కుట్టు మిషన్లు ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జేమ్లా నాయక్ తెలిపారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ హైదరాబాద్ ద్వారా ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద ఉచిత కుట్టు మిషన్ల కోసం tgobmms.cgg.gov.in దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

సబ్ జైల్‌ను తనిఖీ చేసిన న్యాయమూర్తి

మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జితేందర్

మెదక్ అర్బన్, డిసెంబర్ 20: జిల్లా కేంద్రంలోని సబ్ జైల్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్ శుక్రవారం తనిఖీ చేశారు. జైలులోని ఖైదీల ఆర్యోగం గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయవిజ్ఞాన సదస్సులో ముద్దాయిలకు వివిధ అంశాలపై లీగల్ అపాయింట్మెంట్, జైల్ అదాలత్, ప్రీ బార్గెనింగ్ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రామశర్మ, తదితరులు పాల్గొన్నారు.

బాలసదనాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి

జిల్లా కేంద్రంలోని స్టేడియం వద్ద ఉన్న బాలసదనాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జితేందర్ తనిఖీ చేశారు. బాలసదనంలోని పిల్లల చదువు, ఆరోగ్యం, వసతుల గురించి తెలుసుకున్నారు. వంటశాల తనిఖీ చేసి ఆహారం గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. ఆయన వెంట డీసీపీవో కరుణశీల, సూపరింటెండెంట్ పద్మలత తదితురులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ సరస్వతి

అల్లాదుర్గం, డిసెంబర్ 20: స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ సరస్వతి అన్నారు. శుక్రవారం స్థానిక సమాఖ్య కార్యాలయంలో రేగోడ్, అల్లాదుర్గం, టేక్మాల్, పెద్దశంకరంపేట మండలాలకు చెందిన ఐకేపీ వీవోలతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాదిలో సర్ప్ నుంచి ఏవైతే కార్యక్రమాలు జరుగుతున్నాయో వాటిపై బ్యాంకు లింకేజీ ఈ నెల 31లోపు పూర్తి చేయాలన్నారు. స్త్రీ నిధి రుణాలను క్రమం తప్పకుండా చెల్లించాలని సూచించారు. సమావేశంలో డీపీఎం బ్యాంకు లింకేజీ వెంకటేశ్వర్లు, ఏపీఎంలు నాగరాజు, గోపాల్, సంగీత, రామకృష్ణ, ఆయా మండలాలకు చెందిన కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

జంగరాయి రోడ్డుకు మరమ్మతులు చేయించాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 20: చిన్నశంకరంపేట నుంచి జంగరాయికి వెళ్లే బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని మాజీ ఏఎంసీ డైరెక్టర్‌బండెళ్ల ప్రభాకర్ బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు నరేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జంగరాయి బీటీ రోడ్డు గుంతలమయంగా మారిందని, నడవలేని స్థితికి చేరుకుందన్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. గతంలో రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరైనా ఇప్పటివరకు పనులు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.